# ఇదో దారి

"విభావసు ఇంకా ఇంటికి రాలేదండి" కళా రత్నం భర్తకి చెప్పింది.

"కారు వెళ్ళలేదా?"

"వెళ్ళింది. నాలుగున్నరకే ఎవరూ తీసుకెళ్ళారుట"

రిసీవర్ అందుకుని ఓ నంబర్ తిప్పాడు అశ్వనీ కుమార్ వెంటనే.

"హలో, కమీషనర్ గారున్నారా.... నా పేరు అశ్వనీకుమార్.... అలాగే" రిసీవర్ చేతితో మూయ కుండానే భార్యని అడిగాడు.

"పోలీసులకి రిపోర్టు చేసావా?"

కళారత్నం తల అడ్డంగా వూపింది.

"హలో. అశ్వనీ కుమార్ స్పీకింగ్ వారం క్రితం మనం ఓ ఫంక్షన్‌లో కలుసుకున్నాం.... అవును.... విభావసు నా ఆఖరి మనవడు కనబడటం లేదండి...." వివరాలు చెప్పాడు.

"ప్లీజ్. తెల్లవారుజాముకి వివరాలు తెలిసినా సందేహించకుండా వెంటనే ఫోన్ చేయండి థాంక్స్".

రిసీవర్ క్రేడిల్ మీద వుంచి అడిగాడు.

"వాడి ఫ్రెండ్స్ ఇళ్ళకి ఫోన్ చేసావా?" మౌనంగా తలవూపింది కళారత్నం.

ఫోన్ గణ గణ మ్రోగింది. రిసీవర్ అందుకుని "హలో" అన్నాడు అశ్వనీకుమార్.

"విభావసు వున్నాడా?" అడిగిందో కంఠం. కొద్దిగాకరుకుగావుంది.

"లేదు. మీరెవరు?"

"నేనే"

ఫోన్ పెట్టేసారు అవతలి వైపు,

విచిత్రం అనిపించింది అశ్వనీకుమార్‌కి.

మరో అయిదు నిమిషాల తర్వాత మళ్ళీ ఫోన్ మ్రోగింది.

"విభావసు వున్నాడా?"

అదే కంఠం. అవే మాటలు.

"లేడు మీరెవరో చెప్పనేలేదు?"

"చెప్తా." క్లిక్ మంది ఫోన్.

పోలీస్ కమీషనర్ ఇంటికి ఫోన్ చేసి జరిగింది చెప్పాడు భార్య సలహా మీద.

"డెవలప్‌మెంట్స్ వుంటే చెప్పండి.

మళ్ళీ అయిదు నిషాల తర్వాత ఫోన్ మోగుతుందని ఎదురు చూసారుకాని మోగలేదు. దాదాపు అరగంట తర్వాత మోగింది. రిసీవర్‌ని చటుక్కున అందుకుని "హలో" అన్నాడు అశ్వనీకుమార్.

"విభావసు మాదగ్గర వున్నాడు"

"ఎవరు మీరు? మీదగ్గ రెందు కున్నాడు?"

క్లిక్.

అశ్వనీ కుమార్ మొహంలో ప్రవేశించిన భయాన్ని గుర్తించి అడిగింది కళారత్నం.

"ఏమిటి?"

"నాకు అనుమానంగా వుంది మన వాడు ఎవరో గూండాల చేతు లలో చిక్కు కున్నాడని"

"ఏం కావాలి మీకు?"

"చెప్తా"

"విభావసు కిడ్నాప్ అయ్యాడు ఎన్ని లక్షలు అడుగుతారో!" చెప్పాడు అశనీ కుమార్.

"బ్లాక్ మనీ దాచలేక చస్తున్నాం. అదిచ్చయినా వాడిని విడిపించు కుందాం"

అయిదు నిమిషాల తర్వాత ఫోన్ మ్రోగగానే కళారత్నం అందు కుంది ఫోన్.

"ఎంత కావాలో చెప్పండి" అరిచింది కీచుగొంతుతో.

"అశ్వనీ కుమార్‌ని పిలు"

కుమార్ రిసీవర్ అందుకున్నాక అడిగాడు ఆత్రంగా.

"ఎంత? ఎక్కడ?"

చిన్నగా నవ్వు.

"ఎంత కాదు ఎక్కడ కాదు, నీకు సిగ్గు లేదు, అరవైలో అరవైలా కడబడుతున్నా ఇరవైలా నటించడానికి? నీకు బయటి సినిమాలు ఎలాగు లేవు రేపు ఉదయం నువు హీరోగా నటించడానికి మొదలు పెట్టే నీ స్వంత చిత్రంలో నువు నటించ నని మాటయిస్తే నీ పధ్నాలుగేళ్ళ ఆఖరి మనవడు బ్రతుకుతాడు. లేదా వాడి శవం నీ యింటికి వసుంది. ఎప్పుడైనా నటించడానికి ప్రయత్నిస్తే నీ పదహారుమంది మనవలలో ఎవరో ఒకరు సఫా అవుతారని గుర్తుంచుకో!"

"నాకు నా వాళ్ళ ప్రాణాలు ముఖ్యం. ఎవరు నువ్వు?"

"తెయిగు సినిమా ప్రేక్షకుల సంఘం నియమించిన సంఘ సేవకుడిని"